# దేశంలో గజ్వేల్ పేరు మార్మోగుతున్నది

**సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహించడంతోనే గజ్వేల్‌కు మహర్దశ**

**పదేండ్ల అభివృద్ధి ఇక్కడ కొద్ది కాలంలోనే జరిగింది..**



గజ్వేల్ మండలం బయ్యారంలో పర్యటిస్తున్న మంత్రి హరీశ్‌రావు

- కేసీఆర్‌ను ఏకగ్రీవంగా ఆశీర్వదించాలి..
- కామారెడ్డి కంటే ఎక్కువ మెజార్టీ గజ్వేల్‌నే రావాలి
- ప్రతి ఒక్కరూ సద్దితిన్నరేవు తలవాలే
- ఛత్తీస్‌గఢ్ నుంచి మగకూలీలు ఇక్కడి వలస వస్తారని ఊహించామా
- నాడు రైతుల బతుకులు దుర్భరం.. నేడు కర్షకులకు గౌరవం
- గుంట ఎండకుండా పంటలు పండుతున్నాయి
- ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు

గజ్వేల్, అక్టోబర్ 3 : గత ప్రభుత్వాల హయాంలో రైతు ఆత్మహత్యలు చూసే వాళ్లమని, తెలంగాణలో కేసీఆర్ వచ్చిన తర్వాతే రైతుల ఆత్మ గౌరవం, ఆత్మవిశ్వాసం, వ్యవసాయ భూముల విలువ పెరిగిందని, రైతే రాజు అనే నినాదం నిజం చేశారని ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గజ్వేల్‌లో మంగళవారం పత్తి మార్కెట్‌ను ప్రారంభించిన సందర్భంగా రైతులను ద్దేశించి ఆయన మాట్లాడారు. కేసీఆర్ సీఎం రాకతో గజ్వేల్‌లో పాత మార్కెట్‌ను నేడు రూ.4కోట్లతో అద్భుతంగా మార్చి రైతే రాజుగా చేశారన్నారు. కాంగ్రెస్ హయాంలో రైతులు ఆత్మహత్యలు చేసుకునే వారన్నారు. సీఎం కేసీఆర్ రాకతో రైతుల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని, రైతుబంధును అందించిన ప్రభుత్వం దేశంలోనే బీఆర్ఎస్‌మాత్రమేనన్నారు కాళేశ్వరం నీళ్లను అందించి సంవత్సరంలో రెండు పంటలు పండించుకునే విధంగా చేశారని, పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తున్న కేసీఆర్‌ను మరువొద్దన్నారు. గతంలో సాగు భూములను అమ్మితే ఐదారు లక్షలు వచ్చేవని, కానీ నేడు కొందామంటే ఎక్కడ కూడా భూములు దొరకడం లేదన్నారు. వానకాలం, యాసంగి పంటలు పండిస్తూనే కొంత మంది రైతులు కూరగాయలు మూడో పంటగా పండించుకుంటున్నారన్నారు. దేశంలో 24గంటల కరెంట్ ఇచ్చే దమ్మున్న లీడర్ ఒక్క కేసీఆర్ మాత్రమేనన్నారు. గుంట ఎండకుండా పంటలు తీసేలా కరెంట్ ఇస్తున మహనీయుడు కేసీఆర్ అన్నారు. గత కాంగ్రెస్ హయాంలో రైతులు ఎరువుల కోసం చెప్పులు లైన్‌లో పెట్టి నిలబడితే బస్తా కూడా దొరికేది కాదన్నారు. కానీ కేసీఆర్ ఎరువులు, విత్తనాలు, పెట్టుబడిసాయం, పండించిన పంటను అమ్ముకునేలా కడుపులో పెట్టుకొని చూసుకుంటుంన్నాడన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఉన్నప్పుడు రైతుల బతుకులు దుర్భరంగా ఉండేవని, కేసీఆర్ రాకతో బతుకులు మారాయన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఆరెడు వేల మెగవాట్ల కరెంట్ ఉంటే ఇవాళ 17వేల మేగవాట్ల విద్యుత్ మూడింతలు పెరిగి కరెంట్ వాడుకుంటున్నామన్నారు. దేశంలో జైకిసాన్...జైజవాన్ అంటూ చెతితో చూపించే రైతుల గుండెల్లో కేసీఆర్ కనబడుతున్నారన్నారు. పత్తి మార్కెట్‌లో 5వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాం మంజూరు చేస్తున్నట్లు మంత్రి ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు. మా ర్కెట్‌కు వచ్చిన మంత్రి హరీశ్‌రావుకు అపూర్వ స్వాగతం లభించింది. కార్యక్రమంలో జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఎంపీపీ అమరావతి, జడ్పీటీసీ మల్లేశం, పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశంగౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

### రింగ్ రోడ్డును ప్రారంభించిన హరీశ్‌రావు

గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చుట్టూ 21కిలో మీటర్ల వరకు రూ.305కోట్లతో నిర్మించిన గజ్వేల్ రింగ్‌రోడ్డును మంత్రి హరీశ్‌రావు రాజీవ్ రాహదారి పాతూర్ చౌరస్తా రింగ్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌అండ్‌బీ అధికారులు మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం మంత్రి సంబంధిత ఆర్ అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్లను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఎస్ఈ వసంతనాయక్, ఈఈ బాలప్రసాద్, డీఈ రామకృష్ణ, ఏఈలు శ్రీనివాస్, శ్వేత, కాంట్రాక్టర్ బాపినీడు, శ్రీమాన్ పాల్గొన్నారు.



గజ్వేల్‌లో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌ను కుర్చీలో కుర్చోబెడుతున్న మంత్రి హరీశ్‌రావు

### మోడల్ బస్టాండ్‌ను ప్రారంభించిన మంత్రి

గజ్వేల్ పట్టణ సమీపంలోని తూప్రాన్ మార్గంలో రూ.5కోట్ల తో నిర్మించిన మోడల్ బస్టాండ్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆర్టీసీ అధికారుల మంత్రికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ భవనం ప్రారంభోత్సవం

గజ్వేల్ పట్టణంలో రూ.1.90కోట్లతో నిర్మించిన అంబేద్కర్ భవన్నాని మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. ముందు గా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు రాములు, ప్రధాన కార్యదర్శి కిష్టయ్య, సంఘం సభ్యులు ఎల్లయ్య, పి.ఎల్లయ్య, సత్యనారాయణ, కుమార్, మైసరాములు, శివకుమార్, తుమ్మ శ్రీనివాస్, యాదగిరి పాల్గొన్నారు.



గజ్వేల్‌లో అంబేద్కర్ భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సిద్దిపేటలో రైలు ప్రారంభోత్సవ కార్యక్రమాకి పెద్ద ఎత్తున హాజరైన ప్రజలు, బీఆర్ఎస్ కార్యకర్తలు






సిద్దిపేట రైల్వేస్టేషన్ కు చేరుకున్న రైలు



సిద్దిపేట రైల్వేస్టేషన్ వద్ద సందడి చేస్తున్న ప్రజలు

- సిద్దిపేటలో జెండా ఊపి రైలును ప్రారంభించిన మంత్రి తన్నీరు హరీశ్‌రావు
- పూలు చల్లుతూ, స్వీట్లు పంపిణీ
- దశాబ్దాల కలను సాకారం చేసిన సీఎం కేసీఆర్
- 4.20 గంటలకు సిద్దిపేట నుంచి బయలు దేరిన రైలు
- సిద్దిపేట నుంచి దుద్దెడ వరకు రైలులో ప్రయాణించిన ప్రజాప్రతినిధులు
- వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- రైలు వద్ద సెల్ఫీలు తీసుకున్న జనం

రైలులో ప్రయాణిస్తున్న మంత్రి హరీశ్ రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి



# కలల రైలొచ్చింది

## సిద్దిపేటలో అంబరాన్నంటిన సంబురం

సిద్దిపేట ప్రతినిధి/ సిద్దిపేట అర్బన్, అక్టోబర్ 3 (నమస్తే తెలంగాణ) : సిద్దిపేట జిల్లా ప్రజల కల సాకారమైంది. చుక్ చుక్ రైలు బండి రానే వచ్చింది. దశాబ్దాల కల సాకారం కావడంతో ప్రజల సంతోషాలకు అవధులు లేకుండా పోయాయి. దీంతో వేలాదిగా తరలివచ్చిన ప్రజలు.. బీఆర్ఎస్ కార్యకర్తల సంబురాల మధ్యన రైలును మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ, ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కడవేర్గు మంజులారాజనర్సుతో కలిసి సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు సిద్దిపేట నుంచి సికింద్రాబాద్ (కాచిగూడ)కు రైలును ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ప్రారంభించారు. సరిగ్గా 4.20 గంటలకు సిద్దిపేట రైల్వే స్టేషన్ నుంచి దుద్దెడ వరకు రైలులో ప్రయాణించారు. సిద్దిపేట రైల్వేస్టేషన్‌లో ప్రజలు, కార్యకర్తల మధ్యనే మంత్రి తన సంతోషాన్ని పంచుకున్నారు. మన కలలను సీఎం కేసీఆర్ నెరవేర్చారని చెప్పారు. పూలు చల్లుతూ, స్వీట్లు పంచుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు అనుకూలంగా పెద్ద ఎత్తున ప్రజలు, కార్యకర్తలు నినాదాలు చేశారు.

### సిద్దిపేటకు రైలు రావడం గొప్ప వరం

సిద్దిపేట జిల్లాకు రైలు రావడం గొప్ప వరమని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. నీళ్లు, నిధులు, జిల్లా ఈ కలలను నిజం చేసింది సీఎం కేసీఆర్ మాత్రమేనన్నారు. గత ప్రభుత్వాలు తెలంగాణను పట్టించుకోలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు ఎప్పుడు జరిగినా సిద్దిపేటకి రైలు తెస్తామని ప్రతి పక్ష పార్టీలు చెప్పాయన్నారు. ఎన్నికలు పూర్తి కాగానే వాటిని మర్చిపోయాయన్నారు. 2006 రైల్వేలైన్ మంజూరైందని.. 33 శాతం రాష్ట్ర వాటా చెల్లించాలని కేంద్రం చెప్పిందన్నారు. సీఎం కేసీఆర్ రైల్వే లైన్‌ని స్వయంగా రూపకల్పన చేశారన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రులు మారారు కానీ రైల్వేలైన్ రాలేదన్నారు. ప్రజల అదృష్టం తెలంగాణ రావడం, సీఎం కేసీఆర్ కావడం వల్లనే ఇవాళ రైలు వచ్చిందన్నారు. ఆనాడు కేంద్ర మంత్రిగా కేసీఆర్ ఉన్నారు..ఈనాడు రాష్ట్ర ప్రభుత్వం వాటా చెల్లించిందన్నారు. సిద్దిపేట, మెదక్, కరీంనగర్ పై ఆనాటి ప్రభుత్వాలు కక్షకట్టాయన్నారు. బీజేపీ వాళ్లు రైలు మా వల్లనే వచ్చిందని చెబుతున్నారు ఇది సిగ్గుచేటన్నారు. 33 శాతం వాటా కడితే కనీసం సీఎం ఫొటో కూడా పెట్టలేదన్నారు. 2,508 ఎకరాల భూ సేకరణ కోసం 310 కోట్లు చెల్లించింది తెలంగాణ ప్రభుత్వమన్నారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 330 కోట్లు ఇచ్చామన్నారు. ఇది చూస్తుంటే సొమ్ము ఒకడిది సోకు మరొకరిది అన్నట్లు ఉందన్నారు. దీంట్లో కేంద్ర ప్రభుత్వం ఏమీ చేసిందని మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. సిద్దిపేట రైల్వేలైన్ కోసం కష్టపడ్డది మేము...డబ్బులు ఇచ్చింది మేము..ఈ విజయం తెలంగాణ ప్రజలదన్నారు. ఆనాడు తొమ్మి దేండ్లు కాంగ్రెస్ మోసం చేసింది...ఈనాడు బీజేపీ అబద్ధాలు ఆడుతుందని మండి పడ్డారు. కేసీఆర్ లేకపోతే రైల్వే లైన్ లేదన్నారు.



సిద్దిపేట రైల్వేస్టేషన్ వద్ద ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి



సిద్దిపేటలో టికెట్ తీసుకొని ప్రయాణిస్తున్న ఓ కుటుంబం



సిద్దిపేటలో రైల్వే కౌంటర్ వద్ద టికెట్ తీసుకుంటున్న ప్రయాణికులు

### సందడిగా సిద్దిపేట రైల్వే స్టేషన్

ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న సిద్దిపేట ప్రాంత వాసుల కల నెరవేరింది. రైలును చూసేందుకు చాలా మంది ప్రజలు రైల్వే స్టేషన్‌కు చేరుకున్నారు. దీంతో రైల్వే స్టేషన్ పరిసర ప్రాంతాలు సందడిగా మారాయి. కుటుంబ సమేతంగా వచ్చి రైలును చూసి ఆనందం వ్యక్తం చేశారు. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా రైలు వద్ద సెల్ఫీలు దిగి, స్టేటస్‌లు పెట్టుకుంటూ సంతోషంగా గడిపారు. సిద్దిపేట పట్టణం నుంచే కాకుండా సిద్దిపేట జిల్లా నలుమూలల నుంచి రైలు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రజలు వచ్చారు. కొంత మంది మొదటి రోజే సికింద్రాబాద్ వరకు రైలులో ప్రయాణం చేసి కొత్త అనుభూతిని పొందారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పూలు చల్లి.. స్వీట్లు పంచుకున్నారు. ఓ వైపు పెద్ద ఎత్తున జన సందోహం రావడంతో మంత్రి హరీశ్‌రావు చాలాసేపు ఉత్సాహంగా రైల్వేస్టేషన్‌లో గడిపి.. అనంతరం దుద్దెడ రైల్వే స్టేషన్ వరకు రైలులో ప్రయాణించారు.



సిద్దిపేటలో రైలు ఎక్కుతున్న ప్రయాణికులు

### చాలా సంతోషంగా ఉంది



గ్రామానికి రైలు రావడం చాలా సంతోషంగా ఉన్నది. ఎన్నో ఏండ్లుగా ఎదురు చూస్తున్న రైలు నేడు రావడం చాలా ఆశ్చర్యం కలిగింది. ఆర్థిక, వైద్యారోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిరంతర కృషి వల్లనే ఇది సాధ్యమైంది. ఇక నుంచి సికింద్రాబాద్ వెళ్లేందుకు ఎంతో సులువుగా ఉంటుంది. ఇందుకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావుకు ప్రత్యేక ధన్యవాదాలు..

**- రాజబోయిన సంతోష్‌కుమార్, నర్సాపూర్**

### ఇది చారిత్రాత్మక దినం



సిద్దిపేటకు రైలు రావడం చారిత్రాత్మక దినం. చాలా ప్రభుత్వాలను చూశా. కానీ ఇంత త్వరగా భూసేకరణ చేసి.. రైల్వేలైన్ పనులను దగ్గరుండి పర్యవేక్షించి మా కలను నిజం చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వానికి, మంత్రి హరీశ్‌రావుకు రుణపడి ఉంటాం. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఏదైనా అనుకుంటే తప్పకుండా చేసి తీరుతారు. సిద్దిపేట నుంచి హైదరాబాద్, బెంగళూరుకు ఇంకా చాలా ప్రదేశాలు వెళ్లేందుకు మాకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది.

**- గడ్డం రాజేశంగౌడ్, అల్లీపూర్, చిన్నకోడూరు మండలం**

### సిద్దిపేటకు వస్తుందనుకోలేదు



మా పొలం సిద్దిపేట రైల్వే స్టేషన్‌కు చాలా దగ్గరలో ఉంటుంది. ఇంత తొందరగా రైల్వేలైన్ పూర్తయి రైలు వస్తుందని కలలో కూడా అనుకోలేదు. ఈరోజు సిద్దిపేట నుంచి హైదరాబాద్ పోయేందుకు రైలు ప్రారంభకావడం ఎంతో సంతోషంగా ఉంది. నిజంగా రైలులో తిరుగుతుంటే ఇది కలా.. నిజమా అన్నట్లుగా ఉంది.

**- తాళ్ల కవిత, లింగారెడ్డిపల్లి**

### రైలును చూస్తామనుకోలేదు..



మాకు డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చింది. ఇప్పుడు మా ఇండ్ల వద్దకే రైలు వస్తున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఎక్కన్నో హైదరాబాద్ లాంటి నగరాల్లో రైలును చూసేది. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు కృషివల్ల సిద్దిపేటకు రైలు వచ్చింది. రైలు ప్రారంభమైతుందని తెలిసి మా బ్లాక్‌లో ఉన్న అందరం రైలును చూసేందుకు వచ్చాం. నిజంగా ఇక్కడికి వచ్చి చూస్తే ఎంతో సంతోషమనిపిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు.

**- అక్కాల లత, కేసీఆర్ నగర్**

### మంత్రి హరీశ్‌రావుకు కృతజ్ఞతలు



మంత్రి హరీశ్‌రావు సహకారంతో డబుల్ బెడ్ రూం ఇల్లు వచ్చింది. సిద్దిపేటకు రైలు వచ్చిందని అసలు నమ్మలేకపోతున్నాం. చాలా ఏండ్ల నుంచి సిద్దిపేటకు రైలు వస్తుందని ఎదురు చూశాం. కానీ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు సార్లతోనే ఇది సాధ్యమైంది. మా కు ఇంత మంచి సౌకర్యం కల్పించిన ప్రభుత్వానికి కృతజ్ఞతగా ఉంటాం.

**- కానోజు లలిత, కేసీఆర్ నగర్**

### మొదటి రోజే ప్రయాణించడం గొప్ప అనుభూతి



మొదటిసారి సిద్దిపేట నుంచి రైలులో ప్రయాణించడం గొప్ప అనుభూతి కలిగింది. హైదరాబాద్‌లో ఉన్న మా కుమారుడి వద్దకు వెళ్తున్నాం. ఇది జీవితంలో గుర్తుండిపోయే రోజు. ఇంత మంచి సౌకర్యం కల్పించిన సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావులకు ప్రత్యేక ధన్యవాదాలు.

**- దుర్శేటి సిద్ధేశ్వర్-లక్ష్మీనర్సవ్వ, సిద్దిపేట**